క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయిలో విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో లీగల్ లిటరసీ క్లబ్ వారు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ లిటరసీ క్లబ్‌లో ఉన్న న్యాయ సంబంధిత పుస్తకాలు, కంప్యూటర్‌ను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఎన్‌డీపీఎస్ చట్టం గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ పాఠశాల హెడ్మాస్టర్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పై వివక్షతో నెల రోజులు అయినా జీతాలు చెల్లించకపోవడం తగదని, వెంటనే వారికి చెల్లించాలని జీతాలు ఈపీఎఫ్ ఈఎస్ఐ ఎల్ తో సహా చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గారి చంద్ర డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా వేధిస్తున్నాయని, ఈఎంఐలు చెల్లించలేక, రోజువారి కార్యకలాపాలు కొనసాగలేక తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందచేస్తున్న ట్రస్టు ప్రతినిధి శ్రీరాములరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం హిస్టరీ అధ్యాపకులు శ్రీరాములరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాములరెడ్డి చారిటబుల్ ట్రస్టు సహకారంలో హెచ్‌ఈసీ, సీఈసీ చదువుతున్న ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా చారిటబుల్ అధినేత శ్రీరాములరెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు పేద విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా, లైబ్రేరియన్ రామసుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు సుధాకర్‌రాజు, చంద్రమౌళి, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలో భాగంగా అభ్యర్థి పత్రాలను పరిశీలిస్తున్న వైవీయూ ఆచార్యులు

కడప ఎడ్యుకేషన్ : వైవీయూలో ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్య టి శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సైన్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ ఏజీ దాము, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిపార్టుమెంట్ ఆఫ్ వైరాలజీ ప్రొఫెసర్ జి నరసింహ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుబోష్ చంద్ర, ప్రొఫెసర్లు ఆచార్య డి. విజయ రాఘవ ప్రసాద్, ఆచార్య ఎల్. వీరాంజనేయ రెడ్డి, ఆచార్య డి విజయలక్ష్మి ఇంటర్వ్యూలను నిర్వహించారు. వైవీయూ కుల సచివులు ఆచార్య పి పద్మ పర్యవేక్షించారు. ప్రిన్సిపల్ కార్యాలయ సూపరింటెండెంట్ కె. శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

చింతకొమ్మదిన్నె : మండలంలోని జె.కొత్తపల్లి జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మేకల శివార్జున, ఆకుమళ్ల రాజబాబు (బీటీయూఏపీ), రామచంద్రారెడ్డి (ఏపీటీఎఫ్) మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పాఠశాల సహాయకులు, జూనియర్లు అయినప్పటికీ, వారిని ఎంఈఓ-1లుగా నియమించడం దురదృష్టకరమని, ఇది సమంజసం కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అలా నియమించిన వారిని వెంటనే వెనక్కి పంపించాలని కోరారు. పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఎన్నో వేలమంది ప్రధానోపాధ్యాయులు ఉండగా, వారిని కాదని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పాఠశాల సహాయకులను ఎంఈఓ-1లుగా నియమించడం పంచాయతీరాజ్ శాఖ ఉపాధ్యాయులను అవమానించడమేనని పేర్కొన్నారు.

తాటితోపు కనువిందు





జిల్లాలోని కమలాపురం నియోజకవర్గంలోని చెప్పలి మార్గంలోని పొలాలలో తాటి తోపు కనువిందు చేస్తోంది. కొన్ని వందల తాటి చెట్లు వరుసగా ఏపుగా పెరిగాయి. ఈ మార్గం గుండా వెళ్లే వారు కాసేపు ఆగి ఈ తాటిచెట్లను చూస్తూ.. భలే ఉన్నాయి కదూ.. అంటూ తమ సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీసుకుంటున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



పోస్టర్లను విద్యార్థులు, ప్రిన్సిపాల్స్‌తో కలిసి విడుదల చేస్తున్న ఈగల్ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : మత్తు పదార్థాలను సేవించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని ఈగల్ అధికారులు సూచించారు. గురువారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 'ఈగల్' టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని బీరం జూనియర్ కళాశాలలో యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ సమాజంలో కొంతమంది యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగన్న వారి కలలను కల్లలుగా చేస్తున్నారని, మత్తు పదార్థాల సేవనం వల్ల మైండ్ తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారన్నారు. మీరు నివసించే చుట్టుపక్కల ప్రాంతాలలో ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డట్లు గుర్తించినా లేదా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, బషీర్ అహమద్, అధ్యాపకులు, విద్యార్థులు, 'ఈగల్' సిబ్బంది పాల్గొన్నారు.

5న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ, రైల్వే హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని, స్మార్ట్ మీటర్ల దారిదోపిడి విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈనెల 5వ తేదీన విద్యుత్ భవన్ వద్ద ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టనున్నాయని రైల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబాషలు తెలిపారు. గురువారం స్థానిక కడప రైల్వే స్టేషన్ ఆవరణలో గూడ్స్ షెడ్ యూనియన్ కార్యాలయంలో ఆందోళనలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసంఘాలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విద్యుత్ భవన్ ఎస్ఈ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలి యూనియన్ నాయకులు పాల్ శ్రీను, చిన్న ఓబులేసు, నాగేంద్ర, గంగయ్య, సూరి, సుబ్బారామ్, రంగనాయకులు పాల్గొన్నారు.

మీ సేవలు చిరస్మరణీయం



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను, సిబ్బందిని సన్మానిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖకు విశేష సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జులై నెలాఖరున పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బంది ని శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికలు అందచేసి ఘనంగా వీడ్కోలు పలికారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటినుండి ఇప్పటివరకూ శాంతిభద్రతల పరిరక్షణకు సేవ చేస్తూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం కూడా గుర్తుండిపోయేలా మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తాయన్నారు. విధి నిర్వహణలో అప్పటి కఠిన పరిస్థితుల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం సాధారణ విషయం కాదన్నారు. నిబద్ధత, అంకితభావంతో పోలీస్ శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ టైటస్, డి.పి.ఓ ఏ.ఓ జ్యోతి, ఆర్.ఎస్.ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈ.సి మెంబర్ ఏప్రిన్, పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం పొందిన వారు

- ఎ.రవిశంకర్, ఆర్.ఎస్.ఐ, డి.ఎ.ఆర్, కడప
- బి.ఆర్ నరసింహులు, ఎ.ఎస్.ఐ, ప్రొద్దుటూరు ట్రాఫిక్ పి.ఎస్
- సి.నాగేశ్వారెడ్డి, హెచ్.సి 1568, వల్లూరు పి.ఎస్

చలమారెడ్డి సేవలు మరువలేనివి



చలమారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉపాధ్యాయుడిగా ఎంతో మంది ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడిన గజ్జల చలమారెడ్డి సేవలు ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిదాయకమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. సిద్దవటం మండలం మాధవరం-1లోని వెంకటేశ్వరపురం పాఠశాలలో పనిచేస్తూ చలమారెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు గురువారం ఆయనకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చలమారెడ్డి కుటుంబ సభ్యులు గజ్జల పోషిత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాపకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉల్లి రైతుల్లో ఆందోళన

తొండూరు : ఖరీఫ్‌లో రైతుల పంటలకు ప్రీమియం చెల్లించేందుకు గడువు ముగుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారంతో ఉల్లి పంటలకు బీమాకు సంబంధించి ప్రీమియం గడువు ముగుస్తుండటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఆన్‌లైన్ కేంద్రాల వద్దకు రైతులు గుంపులు గుంపులుగా వెళ్లి బారులు తీరినా సర్వర్ పనిచేయకపోవడం, గంటకు ఒక రైతుకు సంబంధించిన వివరాలు పొందుపరుస్తుండటంతో రైతులు పంటల బీమా ప్రీమియం గడువు పెంచాలని కోరుతున్నారు. మరి కొంతమంది రైతుల ఖాతాలు ఆన్‌లైన్ కనిపించకపోవడంతో ఒకవైపు గడువు ముగియడం, మరోవైపు ఖాతాలు కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టు సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో (కేజీబీవీ) సమగ్ర శిక్ష కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి కోరారు. గురువారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9 నెలలుగా అప్పులు తెచ్చి కుటుంబ పోషణ చూసుకుంటూ విధులు నిర్వహిస్తున్నా వారిపై దయ లేకుండా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర సెక్రటరీ ఉద్దె మద్దిలేటి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచబోమని ఒకవైపు ప్రకటన చేస్తూ, మరోవైపు నిర్బంధంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తూ పరోక్షంగా ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కడప నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బలవంతంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో కూలిన చెట్టు



వాహనాలపై కూలిన చెట్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని వాహనాల పార్కింగ్ స్థలంలో గురువారం మధ్యాహ్నం ఓ చెట్టు నేలకూలింది. ఎలాంటి గాలి, వాన లేకున్నా ఉన్నట్లుండి చెట్టు, కొమ్మలు విరిగి పడడంతో స్థానికులు ఆందోళన చెందారు. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆ పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే ప్రమాదం ఉదయం లేదా సాయంత్రం జరిగి ఉంటే నష్టం వాటిల్లేదని, ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లేదని స్థానిక దుకాణదారులు తెలిపారు. పెరిగిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్ లో అవినీతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప కార్పొరేషన్ లో జరుగుతున్న చెత్త పన్ను వసూలు, కుక్కల ఆపరేషన్, ఫుట్ పాత్ వసూళ్లు, అడిషనల్ కార్మికుల సంఖ్య, వేతనాలపై నిజాయితీ గల అధికారి చేత సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇంటి నుండి వసూలు చేసే చెత్త పన్ను రద్దు చేసిందని, కానీ అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, వస్త్ర పరిశ్రమలు లాంటి వాణిజ్య, వ్యాపార సంస్థల నుండి వసూలు చేస్తున్న చెత్త పన్ను వసూళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందన్నారు. ఈ అవినీతిలో చిన్న చౌక్ జోన్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇరామియా, 2 టౌన్ జోన్ మార్కెట్ నాగ సుబ్బయ్య, లక్ష్మీ నారాయణ, శ్రీనివాసులు, సునీల్, 21 వ డివిజన్ మేస్త్రీ రవి తో పాటు దాదాపు 30 మంది శానిటరీ సెక్రెటరీ, ఇన్‌స్పెక్టర్ ల పాత్ర కీలకంగా ఉందని ఆరోపించారు. వీరితో పాటు హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాత్ర కీలకంగా మారిందన్నారు. విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 4 తేదీన కడప కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ తమ సిబ్బందితో కలిసి గురువారం కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలనగృహం సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకొని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్ వైద్యాధికారిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత కడప దళితులకు న్యాయం చేయాలి



వాటర్ గండి ప్రాంతంలో భూములను పరిశీలిస్తున్న అఖిలపక్ష నేతలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని చిన్నచౌక్ గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 919/1 సబ్ డివిజన్ 1145, 1146 లోని వ్యవసాయ భూమి పాత కడప దళితులదే నని, వారికి న్యాయం చేయాలని అఖిలపక్ష నేతలు, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటేష్, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ ఏబీసీ కోఆర్డినేటర్ సత్తార్ పేర్కొన్నారు. గురువారం వాటర్ గండి ప్రాంతంలో ఉన్న దళితుల భూములను అఖిలపక్ష నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత కడప దళితులకు 2005లో 919/1 సబ్ డివిజన్ 1145, 1146 లో ఉన్న భూమిని అన్ని అర్హతలతో దళితులకు ఇచ్చిందని, భూమిపై అర్హత కలిగి ఉన్న దళితులను బెదిరించి దాడులకు యత్నించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వెంటనే వారిని అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బుల్ బాష, కుల వివక్ష పోరాట సంఘం నగర కన్వీనర్ నరసింహులు, రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి, తస్లీమ్ మడగలం ప్రసాద్, చంద్రారెడ్డి, ఓబులేసు, దివాకర్, వెంకటసుబ్బయ్య, చిన్న సుబ్బయ్య, వీర శేఖర్, పెద్ద ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1ను ఎస్ఏలకు ఇవ్వడం తగదు

కడప ఎడ్యుకేషన్ : ఎంఈఓ-1 పోస్టులను గవర్నమెంట్ స్కూల్ అసిస్టెంట్లకు ఇవ్వడం జిల్లా పరిషత్తు ప్రధానోపాధ్యాయులకు తీవ్ర అవమానం అని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏసీబీ గురవారెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించుకోవాలని జిల్లా పరిషత్తు ఉపాధ్యాయులు రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తూ ఉంటే మరొక పక్క రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా పరిషత్ లో ఉపాధ్యాయుల్లో కనీసం రెండు శాతం లేని గవర్నమెంట్ స్కూల్ అసిస్టెంట్‌లను మండల విద్యాశాఖ అధికారి-1 నియమించడం చాలా అన్యాయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన మండల విద్యాశాఖ అధికారి పోస్టులను జూనియర్ కాలేజ్ లెక్చరర్స్, డైట్ లెక్చరర్స్, డిప్యూటీ విద్యాశాఖ అధికారి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పాఠశాల సహాయకులను ఎంఈఓ-1లుగా నియమించడం దురదృష్టకరమని బీటీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌బాబులు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఎన్నో వేలమంది ప్రధానోపాధ్యాయులు ఉన్నారన్నారు. పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ-1గా నియమించాలన్నారు.

అరుళయ్య సేవలు స్ఫూర్తిదాయకం



అరుళయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వాసులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప జిల్లా కథోలిక మొదటి బిషప్ అరుళయ్య సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ అన్నారు. అరుళయ్య 22వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఇందిరానగర్, మేరినగర్, నిరంజన్‌నగర్‌లలో ఆయన చిత్రపటం వద్ద క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ కరువు ప్రాంతమైన జిల్లా ప్రజల సమస్యలను తెలుసుకుని పేదరిక నిర్మూలన కోసం విదేశీ ఆర్థిక సాయంతో అరుళయ్య ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. విద్య, వైద్యంతో పాటు కుటుంబ పోషణకు అవసరమైన గోధుమలు, నూనె, దుస్తులు పేదలకు అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేరినగర్ విజయ్‌కుమార్, రమేష్, మనోహర్, ఓబిలి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

చింతకొమ్మదిన్నె : అధికారం కోసం సాధ్యంకానీ హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గోపలాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, మోహనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు, సమగ్రాభివృద్ధికి కేరాఫ్‌గా ఉండేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పరిపాలనలో సంక్షేమ పథకాల ఊసే లేదని తప్పుబట్టారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ అంటూ ఇంటింటికి తిరిగి క్యూఆర్ కోడ్ కలిగిన కరపత్రాలు పంచుతూ గత ప్రభుత్వ పరిపాలనకు ,ప్రస్తుత ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ఆయన ప్రజలకు వివరించారు.

మాట తప్పిన కూటమి నేతలు

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ. 20 వేలు నగదు జమ చేస్తానని చెప్పి.. ఇప్పుడు మాట తప్పారని నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టిస్తానని చెప్పి ఇంతవరకు దానిపై చర్చించలేదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. కరెంట్ చార్జీలు పెంచడంపై ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం ఇంటి వద్దకే వచ్చేవని, ఇప్పుడు రేషన్ షాపుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏ రాష్ట్రంలో అమలుకానీ సంక్షేమ పథకాలు ఏపీలో అమలు చేశారని గుర్తుచేశారు. సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి నేడు రకరకాల కారణాలు చూపుతూ అవి కూడా సరిగా అమలు చేయలేక ప్రజలను సంక్షేమ పథకాలకు దూరం చేస్తూ పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సంపద సృష్టించి పంచుతానని చెప్పిన చంద్రబాబు తన సంపద పెంచుకుంటున్నారని విమర్శించారు. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. నమ్మించి నిండా ముంచిన చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు ప్రభాకరరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి బుసిరెడ్డి నారాయణరెడ్డి, కంచన జయరాం, కోదండరాం, బాల గంగయ్య, మల్లెంబాబు,రమణారెడ్డి, శశికుమార్, సత్యం, శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాబు హామీలన్నీ గాలి మాటలే

పెండ్లిమర్రి : అధికారం కోసం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలి మాటలుగానే మారాయని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి ఎద్దేవాచేశారు. గురువారం సాయంత్రం మండలంలోని రామచంద్రాపురం, ఇందిరానగర్, శాంతినగర్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు ఆరితేరిపోయారని విమర్శించారు. అనంతరం ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో ప్రజలకు గుర్తు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రహాసురెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పొలతల మాజీ చైర్మన్ నాగమల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.